పతిత

"చిట్టూరి"

సష్టిపూర్తయ్యి సంవత్సరమైనా కాలేదు నాన్నగారికి. ఆయనకు యిక మిగిలియున్న కోరిక ఒక్కటే. నా పెండ్లి కండ్లారా చూసి శాశ్వతముగా కండ్లు మూస్తే చాలంటారు. తల్లిలేని కొరతను తీర్చి దిద్ది, పెంచి పెద్దచేసిన నాన్నను పూజ్య బాపూజీగానే పూజిస్తూయున్నాను. ఉబ్బసపు దగ్గుతో ఊపిరాడక బాధపడుచున్న నాన్నను చూస్తుంటే యేమి చేయుటకు నాకు పాలు పోయేదికాదు. అన్నము సైతమూ సహింపక నాన్ననే కాచుకొని కూర్చొనే దాన్ని. "పోయి భోజనము చేయమ్మా, అన్ని కోరికలు తీరిన నా కొరకేమీ బెంగపెట్టుకోకు తల్లీ" అంటుంటే నాకు తీరని బాధ కలిగేది...

"అమ్మా సుగు నీ తమ్ముడు రమణ బడినుండి వస్తే యిట్లా కేకవేయమ్మా" అన్నారు.

"ఇంకా బడినుండి రాలేదు నాన్నా" అన్నాను.

"పోనీలే నీవుపోయి వాసుదేవరావుగారిని నేను పిల్చుకొని రమన్నానని ఒకసారి తీసుకురా అమ్మా" అన్నారు.

◆ ◆ ◆

"నాన్నా వాసుదేవరావుగార్ని తీసుకొచ్చాను."

"సరే నీవుపోయి ఆయనకు కాఫీ తీసుకొనిరా అమ్మా" అన్నారు.

"వాసుగారూ మిమ్మల్ని శ్రమపెట్టి యింటికి రప్పించుకొన్నందుకు యేమీ అనుకోకండి. పరిస్థితులన్నియు మీకు పూర్తిగా తెలిసినవే" అన్నారు నాన్నగారు.

"పర్వాలేదులెండి యిరుగు పొరుగులమైయుండి ఒకరి కొకరు చేదోడు వాదోడుగా యుండుటకంటే యేమున్నదీ. ఇంతకూ నా సహాయమేమిటో తెలియజేస్తారా" అన్నారు వాసుగారు.

"మాట్లాడదాము ముందీ కాఫీ తీసుకోండి. సుగుణ నీవుపోయి నీ పనులు చేసుకో" అన్నారు.

"వాసుగారూ అమ్మాయి సుగుణకు పద్దెనిమిదో పడి ప్రవేశించింది. తల్లిలేని కొరత తీర్చి పెంచి పెద్దదాన్ని చేసేను. నా ప్రాణముండగానే పెండ్లి చేసి కండ్లు మూస్తే చాలని ఉంది. నేను చూస్తే మంచము మీదనుంచి లేవలేని స్థితిలో యున్నాను.

లోకులు కాకులన్న విషయము మీకు తెలిసినదే. మీతో వియ్యమందుకొని యీ సయ్యాపై సుఖముగా కాలము గడపాలని ఉంది. వియ్యానికి పిల్చి కయ్యానికి కాలు దువ్వేవారిలో పరిగణింపక యీ నా కడసారి కోరిక నెరవేర్చెదరనే తలపుతో మిమ్మలని పిలిపించేనని నాన్నగారి ప్రాధేయతను, తలుపు చాటునుండి అంతయు విన్నాను. నాన్నగారి ఉదార స్వభావమునకు, వాత్సల్యమునకు గర్వించేను. వాసుగారి జవాబుకి నాన్నగారెదురు చూస్తున్నారు. ఆయన కొంత తడవు ఆలోచించి సరే మీ యిష్ట ప్రకారమే చేస్తామని శలవు తీసుకోబోతుంటే మిత్రులిద్దరూ కౌగలించుకొని నా కడసారి కోరిక తీర్చినందుకు మరు జన్మలో మీకు కొడుకునై పుడతాను వాసుగారూ," అన్నారు నాన్నగారు. సరే శలవు యిప్పించమంటే భోజనము వడ్డించమన్నారు- నాన్నగారు.

"వియ్యమందుకొని పెండ్లికాండే ప్రథమముగా చేయి కడగకూడదుగా" అన్నారు వాసుగారు. ఇంతలో నాన్నగారు నన్ను కేక వేసి, "అమ్మా మామ గార్కి నమస్కారము చేయమన్నారు." "భారత మహిళ భాద్యత నెరవేర్చు తల్లీ" యని దీవించి నాన్నగారివద్ద శలవు తీసుకొని వెళ్లిపోయేరు. ఇంతలో నాన్నగార్కి దగ్గువస్తే పరిచర్య చేస్తూ తమ్ముడ్ని మందుకి పంపేను. ఆనాడు నాన్నకు నిద్రపటినట్టు మరే దినము పట్టలేదు. కారణమూహించుకున్నాను.

వారము తిరగకముందే వివాహ మతివైభవముగా జరిగింది. నాన్నగారి కడసారి కోరిక నెరవేరింది. దగ్గు కూడా నయమయ్యింది. తమ్ముడు రమణ-స్కూలు ఫైనల్ పరీక్షలు వ్రాసినాడు. మరుసటి నెలలో పరీక్ష పోయినట్టు తెలసింది. బెంగతో యిల్లు విడచి పారిపోయేడు. నాన్న బెంగతో మరల మంచము పట్టేరు. తిరిగి తిరిగి వాడేవస్తాడని ధైర్యము చెప్పేము. కాని లాభము లేకపోయింది. చివరకు మామగారి ప్రోత్సాహము వల్ల మావారు అంటే పేరు మోహన్ రమణను వెతకుటకు బయలుదేరి వెళ్లేరు. రోజులు తిరిగి నెల పూర్తయ్యినా తమ్ముడు జాడ తెలియలేదు. వారిరువురూ తిరిగి రాకపోవుటచే మాకు బెంగ మరీ యెక్కువయ్యింది. నాన్నకు దగ్గు విపరీతముగా వస్తూంది. మందు తెచ్చుటకైనా యెవ్వరూ లేరు. మామగారు కూడా ఊర్లోలేరు. నాకు ధైర్యము చాలక ప్రక్కయింటికిపోయి కమలకు నాన్నగారి పరిస్థితి అంతయూ చెప్పి నాకు సహాయము రమన్నాను. కమలకాదినమున జ్వరముగా నుండుటచే, తన అన్న ప్రభాకర్‌ను వెళ్లమన్నది. ప్రభాకర్ వచ్చుట నా కిష్టము లేకపోయిననూ, నాన్న పరిస్థితి ఆందోళనగా యుండుటచే ఒప్పుకొనక తప్పినదికాదు. నాన్నకు పరిచర్య చేస్తూ ప్రభాకర్‌ను మందుకి పంపేను. ప్రభాకర్ మందుతో తిరిగివచ్చి, రాత్రియగుటచే మమ్ముల నొంటరిగా విడిచిపెట్టి పోలేక మాకు సహాయముగా ఆ రాత్రికి యుండిపోయేడు. రాత్రి సుమారు రెండుగంటలకు నాన్నకు యే దగ్గులేక నిద్ర పట్టింది. నాకు కూడా ముందు రాత్రి నిద్రలేకపోవుటచే గాఢముగా నిద్రపట్టింది. ప్రభాకర్ పక్క మంచముపై నిద్రకాగలేక యెప్పుడు నిద్రపోయేడో నాకు తెలియనే తెలియదు...

తెల్లవారింది. నాన్నగారింకా లేవనేలేదు. ప్రభాకర్ అప్పుడే లేచి మరల వస్తానని యింటికి వెళ్ళిపోయేడు. ఇంతలో మామగారు అప్పుడే వూరునుండి వచ్చి నాన్నకు ఎట్లాగున్నదో చూచుటకు వచ్చేరు. నాన్నగారి క్షేమములు తెల్పిన మీదట "రమణకో సమెల్లి నెలదాటినా మీ అబ్బాయి జాడా జవాబు లేదు. కనపడకపోతే తిరిగైనా వచ్చినారుకాదు. నాకు చాలా భయముగా యున్నది. వారి సంగతి మీ కేమైనా తెలుసునాయని" అడిగేను.

"అమ్మా సుగుణా వాడి విషయము నా నోటితో నీకు చెప్పలేకున్నాను. ఇదిగో మా స్నేహితుడు వాడ్నిగూర్చి వ్రాసిన ఉత్తరము. ఇది చదివితే నీకే అర్థమవ్వుతాది." అని ఉత్తరమిచ్చేరు. ఉత్తర మందుకున్నాను.

మద్రాసు, 1.6.56.

"ప్రియమిత్రులు వాసుదేవరావుగార్కి గోపాల రావు వ్రాయునదేమనగా మీ అబ్బాయి మోహన్ యిక్కడకు ఒక నెలక్రితంవచ్చి, యిక్కడ పేరు పడిన ఒక వేశ్యకులోనుడై యున్నాడు. నేను ఒక సారి చెప్పి చూసేను. కాని లాభము లేకపోయినది. ఎక్కడకు వచ్చినాడో, ఎందుకు వచ్చినాడో తెలియకున్నది. గాన వెంటనే తగు ప్రయత్నము చేయవలయును."

ఇట్లు

మీ శ్రేయోభిలాషి,

కె. గోపాలరావు

ఉత్తరమంతయు చదివేను. అంతయు గ్రహించి పొర్లివచ్చుదుఃఖము నాపుచేసుకోలేకపోయేను.

"అమ్మా సుగుణ, అంతయు తెలిసినదానవు విచారించకు గోపాలరావుగారిని వెంటబెట్టుకొని రమ్మని గట్టిగా వ్రాసేను. నీవేమీ భయపడకు. రెండుమూడు రోజులలో వాళ్లేవస్తారు. మీ తమ్ముడు రమణ కలకత్తాలో యున్నట్లు తెలిసింది. నాన్నగారిని కూడా యిక్కడి వైద్యులంతా అక్కడికే వైద్యమునకు తీసుకెళ్లమంటున్నారు. రేపే నాన్నగార్ని తీసుకొని బండికి బయలుదేరుతాను. రమణ కొరకు అక్కడ ప్రయత్నిస్తాను. నీవు జాగ్రత్తగా యింటివద్దనే యుండుమన్నారు."

నేను వారిమాట కాదనలేకపోయేను. మరునాడుదయముననే నాన్నగార్ని తీసుకొని బండికి వెళ్ళిపోయేరు.

♦ ♦ ♦

కమల అత్తవారింటికి వెళ్ళిపోయింది. నేను మా యింటివద్ద ఒంటిరిగా యుండలేకపోవుటచే కమల తల్లి శాంతమ్మ తన యింటివద్దనే యుండమన్నది. అందుచే అక్కడే యుంటున్నాను. మరునాడు శాంతమ్మ కూతుర్ని చూచుటకు చిన్నపిల్లను నాకప్పగించి రెండు రోజులలో వస్తానని చెప్పి వెళ్లింది. ఇంటివద్ద నేను చిన్నపిల్ల, ప్రభాకర్ మిగిలియున్నాము. రాత్రి అంతా నిద్రపోవుచున్నారు. యవరో వచ్చి తలుపు తట్టేరు. లేచి దీపము వెలిగించి తలుపు తీసేను. మోహన్ బయట నిలబడియున్నారు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయేను. తిరిగి వచ్చినందుకు లోలోన సంతసించేను. కాని అప్పటి మోహన్‌కు యిప్పటి మోహన్‌కు చాలా తేడా కాన్పిస్తుంది. తలుపు తీస్తుండగనే గబగబా లోనికి వచ్చి "యిల్లు, వాకిలి, భర్త అక్కరలేకుండా పరాయి యింటికి వచ్చియుండుటకు కారణమేమిటని గదమాయించుచున్నారు. కారణమంతయు చెప్పేను. కాని నమ్మలేదు. ఇల్లు అంతయు చూసి యింటిలో యవ్వరెవ్వరున్నారన్నారు. ప్రభాకర్ నేను, చిన్నపిల్లయున్నామని అంతయు చెప్పెను. వెంటనే కోపముతో, మీకు నేనక్కరలేదా రావడమెందుకు నీ యిష్ట మొచ్చినట్లే యుండుమని ఒక్క నిముషమైనా యుండకుండా ఆ చీకటిలో యెక్కడికి పోయినారో నాకే తెలియదు.

ఇంత గొడవ జరిగినా, ప్రభాకర్‌కు మెలకువ రానేలేదు. ఏమి చేయుటకు తోచిందికాదు. ఒకదానిపై ఒకటి కష్టములు, యిట్లాగ వస్తున్నవేమిటి భగవంతుడా యనుకొని ధైర్యము చేసుకొని ప్రభాకర్‌ను లేవగొట్టి జరిగిన సంగతంతయు చెప్పేను. అంతయు విని ప్రభాకర్ విస్తుపోయి, సరే, నేను తీసుకొస్తానుండుమని ఆ కటిక-చీకట్లోనే వెళ్లేడు.

తెల్లవారింది. నా జీవితమంతయు కష్టములపాలే చేసినావా భగవంతుడాయని విచారించుచుండగా ప్రభాకర్ తిరిగివచ్చి, మోహన్ కనపడలేదని. మద్రాసు వెళ్లిపోయినాడని యవరో తనకు స్టేషనులో చెప్పేరని చెప్పేడు. మద్రాసు యెందుకు వెళ్లేరో యవరి దగ్గరకు వెళ్లేరో, అంతయు గ్రహించేను.

ఇంతలో కలకత్తానుండి వచ్చుచున్నబండియు కలకత్తా వెళ్లుచున్న బండియు గుద్దుకొని 'పెట్టెలు తిరగపడి, చాలామంది మరణించినారని, రేడియోవార్త తెలిసింది. ఆ బండికే మామగారు, నాన్నగారు వెళ్లియుండుటచే, నా మనసు చాలా ఆందోళనపడింది. అదే దినపత్రికలో మరణించిన వారి పేర్లజాబితాలో మామగారు, నాన్నగారు, తమ్ముడు రమణ పేర్లుచూసి, భగవంతుఁడు తన్ను కూడా చంపివేస్తే తన కష్టములు పూర్తియగునని విచారించుచున్నాను. ఇంతలో పోస్టుజవానువచ్చి నా యాడ్రసు కొచ్చిన ఒక ఉత్తరము యిచ్చి వెళ్లిపోయినాఁడు.

మద్రాసు

4-6-56

పతిత యగు శ్రీమతి సుగుణకు వ్రాయునదేమనగా, అగ్నిసాక్షిగా నుడివిన వాక్యములు భగ్నపరచేవు. నీవెంతో పవిత్రురాలవు మంచిదానవని నమ్మేను.

కాని నీ మంచి యంతయు నా కళ్లారా కన్నాను. గుణానికి సుగుణవే గాని, ఆచారములో వ్యభిచార మవలంబించేవు. నీలాటి పతితలున్నందునే 'కలియుగ మీరీతిగా యున్నాది. ప్రభాకర్ తరువాత నీ ప్రతిభ నెందరకు చూపెదవో! ఇక మీదట నీకు నాకు యే విధమైన సంబంధము లేదు. కారణం నీకే తెలుసు.

ఇట్లు

మోహన్

ఈ ఉత్తరమంతయు చదివేను. వారి అనుమానమంతయు గ్రహించేను. ఆ వేశ్యకు దాశ్యము చేయుటకు నన్ను తిరస్కరించితే గాని వీలులేకపోయింది గాబోలను కున్నాను. ఇక నేనుమాత్రము మిగిలియుండి సాధించే దేమిటియని ఆత్మహత్య చేసుకోబోయేను.

"ఆత్మహత్య మహా పాతకము" చచ్చిసాధించే దేమిటని నా ఆత్మ బోధించింది.

"భారతమహిళ భాద్యత నెరవేర్చు తల్లీ" యన్న మామగారి ఆశీస్సు జ్ఞాపకము వచ్చినది. విచారముతో అక్కడే కూర్చుండిపోయేను. ఎదుటింటి రేడియో నుండి అప్పుడే వచ్చుచున్న నా కష్టములకు సంబంధించిన పాట వినకలిగేను.

"పడుచుపడతి-తడుముకోక పరపురుషుని-ద్వారములో చనువున - కనుమూస్తే పరులెల్లరు - కరువుదీర అపవాదులు - నెపములతో వేయుని - కాయమున్నదే ?

కాని

ఎప్పటికైనా సత్యం
నిరూపించుట తథ్యం
జరిగితీరునది నిత్యం

కాని

తెలియక చేసిన తప్పు
చెప్పి వేసిన మెప్పు
కొందరికే అది ఒప్పు
మరికొందరికది కనువిప్పు

కాని ;

నిరూపించుట కష్టం
లేకున్నచో తీరనినష్టం"

"ఆ తీరనినష్టమేమిటో మీకు నేను వేరే చెప్పనక్కర్లేదు. ఒకవైపు నాన్న, తమ్ముడు మామ, ఏకకాలమరణం, రెండోవైపు భర్తచే బహిష్కరణ యగు నాలాటి మీ సోదరి పుట్టుటమేలో గిట్టుట మేలో చదువరులగు మీరే నిర్ణయించండి. కాని నిజము తెలిసిన మీకు, నేను పతితనో, లేక వేశ్యకు దాశ్యముచేయుచు, లోనుడైయున్న నా భర్త పతితుడో తేల్చి లోకమునకు చాటవలసిన బాధ్యత మీకు విడచేను. నా గాధ వినిపించి మీకు బాధకలిగించినందుకు యేమీ అనుకోరని ఆశిస్తూ శలవుతీసుకుంటున్నాను.

ఇట్లు మీ సోదరి

సుగుణ